ఈనాడు
కుమురం భీం

ఆదివారం అక్టోబరు 6, 2024

కష్టపడి చదివితే.. ఇష్టమైన జీవితం

కుటుంబ నేపథ్యం

అమ్మ : కల్యాణి (గృహిణి)

నాన్న : బి.ఎన్.సర్కార్ (విశ్రాంత ఐపీఎస్)

భర్త : రోహిత్ ఝా (బ్యాంకు ఉన్నతోద్యోగి)

స్వస్థలం : పాట్నా సమీపంలోని షోహసరి పట్టణం హబీబ్ పుర(బిహార్)

అభిరుచి : చిత్రలేఖనం

ఆటలు : వాలీబాల్ ఆడటం ఇష్టం



కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, న్యూస్‌టుడే : ఇలా చదువు పూర్తికాగానే అలా కొలువు రావాలని అందరూ కోరుకుంటారు. ఒకటి, రెండు ప్రయత్నాలు విఫలమైతే నిరాశ పడతారు. ఇక తమతో కాదులే అని నీరసిస్తారు. కొద్దిపాటి ప్రయత్నంతో ఏదో ఒకటి వచ్చింది చాలులే అని సరిపెట్టుకుంటారు. కానీ చాలా కొద్ది మంది మాత్రమే మొక్కవోని దీక్షతో అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు ప్రయత్నించి విజయం దక్కించుకుంటారు. అందులో ఒకరు నిర్మల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న అభిలాష అభినవ్. కష్టపడి చదివితే ఇష్టమైన జీవితం పొందవచ్చంటున్న స్ఫూర్తిదాయక జీవన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే..

అమ్మ ప్రోత్సాహంతో..

కలెక్టర్‌గా ప్రజలకు సేవ చేయాలని చిన్నప్పటి నుంచి లక్ష్యంగా పెట్టుకున్నా. పోటీ పరీక్షలు రాయడం.. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవడం అలవడింది. ఐపీఎస్ కావడానికి అమ్మా నాన్న ఎంతో ప్రోత్సహించారు. 'కల'గన్న ఐఏఎస్ నెరవేర్చుకున్నందుకు సంతోషంగా ఉన్నా. ఇది ఊరికే రాలేదు. చదువుకునే సమయంలో సరదాలకు దూరంగా ఉండి పుస్తకాలతో కుస్తీ పట్టా. కష్టమనిపించినా ఇష్టపడి చదవడంతో ఈ స్థానంలో ఉన్నా. ఇప్పుడు కలెక్టర్ హోదాలో ప్రజలకు అందిస్తున్న సేవలో ఆనందం కనిపిస్తుంది.

మానసికంగా దృఢంగా..

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ఒత్తిడికి లోనుకావొద్దు. నిబద్ధత, క్రమశిక్షణతో చదవాలి. చాలా మంది సివిల్స్ రాసేందుకు ఇష్టమున్నా కష్టమని వెనక్కి తగ్గుతుంటారు. సరైన ప్రణాళికతో ముందుకుసాగితే అనుకున్న లక్ష్యం సాధించవచ్చు. ప్రధానంగా మానసికంగా దృఢంగా ఉండాలి. అపజయాలు ఎదురైనా కుంగిపోవద్దు. చదువుతో భవిష్యత్తు ఉంటుందన్న సంకల్పం బలంగా ఉంటే విజయం వరిస్తుంది.

పాతికేళ్లలోపే లక్ష్యంవైపు..

పాతికేళ్లలోపు కచ్చితంగా లక్ష్యం వైపు అడుగులు పడాలి. ఈ దశలో ఏమి సాధించాలి. ఎటువైపు వెళ్లాలి అనే స్పష్టత ఉండాలి. మీ కల, లక్ష్యం సాధించడానికి వీలైనంత ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలి. ప్రయత్నంలో విఫలమైతే నిరాశ చెందొద్దు. సాధించాలనే సంకల్పం ఉండటం గొప్ప కాదు. దాన్ని అందుకునేవరకు పట్టుదల వీడొద్దు.

ప్రయాణం ఇలా..


- 2012లో బీటెక్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్) నవీ ముంబైలోని ఏసీ పటేల్ కళాశాలలో పూర్తి చేశా.
- పుణేలోని ఐబీఎంలో రెండున్నరేళ్లు ఉద్యోగం చేశాను. తర్వాత దిల్లీలోని సిండికేట్ బ్యాంకులో మేనేజరుగా పనిచేశా.
- 2014లో తొలిసారి సివిల్ సర్వీస్ పరీక్షలు రాసి విఫలమైనా నిరాశ చెందకుండా రెండో ప్రయత్నంలో 2016లో పట్టుదలతో చదివి 308 ర్యాంకు సాధించి ఐఆర్ఎస్(ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్)కు ఎంపికయ్యాను.
- నాగ్‌పూర్‌లో ఆదాయ పన్నుశాఖ అధికారిగా తొమ్మిది నెలలు పని చేశాను.
- 2017లో మూడోసారి సివిల్ సర్వీస్ పరీక్షలు రాసి జాతీయస్థాయిలో 18వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యాను.
- శిక్షణ పూర్తి చేసిన తర్వాత ఆగస్టు 2020లో మొదటిసారిగా మహబూబాబాద్ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా, తర్వాత ఖమ్మం అదనపు పాలనాధికారి(స్థానిక సంస్థలు)గా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) జోనల్ కమిషనర్‌గా పనిచేశాను.
- ఇప్పుడు కలెక్టర్ తొలి పోస్టింగ్ నిర్మల్ జిల్లాలో పనిచేయడం సంతోషంగా ఉంది.

8 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

వాంకిడి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రశాంత్ తెలిపారు. మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో నాలుగు రోజుల పాటు పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 97057 49712, 80085 54313 చరవాణి నంబర్లలో సంప్రదించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

'అడ్డ'దారుల్లో.. మూగజీవాల దందా!

పొరుగు రాష్ట్రం నుంచి నిత్యం పదుల సంఖ్యలో వాహనాల రాక



ఇటీవల పశువులను పట్టుకున్న ఎస్సై కమలాకర్

సిర్పూర్(టి), న్యూస్‌టుడే: మూగజీవాల సంరక్షణకు పటిష్ఠ చట్టాలున్నప్పటికీ అమలు జరగడం లేదు. దొంగచాటుగా ఇతర రాష్ట్రాల నుంచి పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతూ దందా కొనసాగిస్తున్నారు. ముందస్తు సమాచారం ఉంటే పోలీసుల తనిఖీల్లో గుర్తిస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి జీవాలను తరలిస్తుండటంతో ఊపిరాడక మృత్యువాతపడుతున్నాయి.

జిల్లాల్లోని పలు మండలాలు మహారాష్ట్రతో ఆనుకుని ఉండటం.. అక్రమార్కులు అవకాశంగా మారింది. ఎక్కువగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్, వాంకిడి, సిర్పూర్(టి) అంతర్రాష్ట్ర రహదారి గుండా అర్ధరాత్రి సమయంలో దళారులు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన సిర్పూర్(టి), కాగజ్‌నగర్, రెబ్బెన ప్రధాన రహదారి పరిధిలోని సంబంధిత అధికారులకు దళారులు ముందస్తుగా ఒప్పందం కుదుర్చుకొని ఈ దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఫిర్యాదులు వస్తే పోలీసులు వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలిస్తున్నారు. అక్కడ కూడా దళారులు రంగప్రవేశం చేసి విక్రయాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

రెండు మార్గాల్లో..

- ప్రధానంగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలు.. పోడ్సా, వెంకట్రావ్‌పేట్, సిర్పూర్(టి) మీదుగా కాగజ్‌నగర్, రెబ్బెన హైవే మీదుగా హైదరాబాద్
- మహారాష్ట్రలోని అహేరీ నుంచి సలుగుపల్లి, పెంచికల్‌పేట్ మీదుగా.. దహెగాం, వీగాం, టేకులపల్లి మీదుగా బెల్లంపల్లి హైవే మీదుగా హైదరాబాద్.

- ఇటీవల పెంచికల్‌పేట్ మండలం బొక్కివాగు వంతెన సమీపంలో నాలుగు లారీల్లో అక్రమంగా తరలిస్తున్న 149 పశువులను పోలీసులు పట్టుకున్నారు. వీటిలో 21జీవాలు ఊపిరాడక మృతి చెందాయి. మహారాష్ట్రలోని గడ్చిరోలినుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలగా.. నలుగురిపై కేసు నమోదు చేశారు.

ఇవీ నిబంధనలు..

- జంతు పరిరక్షణ చట్టం- 1960 ప్రకారం.. పశువులను వధించడం చట్టరీత్యా నేరం. వట్టిపోయిన జీవాలతోనే వ్యాపారం చేయాల్సి ఉండగా.. మాంసానికి డిమాండ్ ఉండటంతో దళారుల పంటపండుతోంది. రైతుల నుంచి పశువులను రూ. 5 వేల నుంచి రూ.10 వేల వరకు కొనుగోలు చేసి అక్రమంగా తరలించి రూ.15-20 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం.. వ్యవసాయానికి పనికి రాని పశువులను అమ్మిన వ్యక్తి నుంచి కొనుగోలు చేసిన వ్యక్తి గ్రామ పంచాయతీ నుంచి రశీదు విధిగా తీసుకోవాలి. వాటి వయసు నిర్ధారించి పశువైద్యుడు ధ్రువీకరించిన తర్వాతే వాటిని కబేళాకు తరలించాలి. అనారోగ్యంతో ఉన్న పశువులను కోతకు వినియోగించుకునే విధంగా ఉందా లేదా అని వైద్యుడు నిర్ధారించిన తర్వాత ధ్రువీకరించిన పత్రాలతో తరలించవచ్చు. ఇవేమీ అమలు కావడం లేదు.
- వాహనాల్లో తీసుకెళ్లే క్రమంలోనూ జాగ్రత్తలు తప్పనిసరి. గ్రాసం, తాగునీరు ఏర్పాటుచేయాలి. చిన్న వాహనాల్లో 3 లేదా 4, పెద్ద వాహనాల్లో 6 లేదా 7 పశువులను మాత్రమే తీసుకెళ్లాలి. వాహనాలకు పైకప్పు లేకుండా వాటికి గాలి తగిలేలా సరైన పత్రాలతో తరలించాలి. అయితే పశువులను ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి తీసుకువెళ్లే అనుమతిలేదు. ఈ నిబంధనలేవీ పట్టించుకోకుండా వ్యాన్, లారీ, కంటైనర్‌లలో ఎక్కువ మొత్తంలో తరలిస్తుండటంతో ఊపిరాడక మృత్యువాత పడుతున్నాయి.

కఠిన చర్యలు: కమలాకర్, ఎస్సై, సిర్పూర్(టి)

ఒక్క సెప్టెంబరులోనే ఛత్తీస్‌గఢ్ నుంచి కర్ణాటకలోని కోలార్, మహారాష్ట్ర నుంచి నిజామాబాద్‌కు అక్రమంగా పరిమితికి మించి వాహనాల్లో తరలిస్తున్న 126 పశువులను పట్టుకుని గోశాలకు తరలించాం. రాత్రి సమయాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి రవాణాకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

గడ్డం వెంకటస్వామికి నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డి.వి.శ్రీనివాస్‌రావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : కలెక్టరేట్‌లో శనివారం దివంగత మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతిని అధికారికంగా నిర్వహించారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డి.వి.శ్రీనివాస్‌రావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లలు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మహనీయుల సేవలు స్మరించుకోవాల్సిన అవసరముందన్నారు. రాజకీయంగా ప్రజలకు ఎంతో సేవ చేసిన మాజీ ఎంపీ వెంకటస్వామి ఏడుసార్లు గెలిచినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోనూ వెంకటస్వామి జయంతిని జరిపారు. ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐలు రాణాప్రతాప్, పెద్దయ్య, అంజన్న, మార్కండేయ, హరినాథ్, కేశవులు, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'గిరి' గ్రామానికి సౌర వెలుగులు

లింగాపూర్, న్యూస్‌టుడే : చీకట్లలో ఉంటున్న గిరిజనులకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పోలీసులు సోలార్ (సౌర) దీపాలను అందించారు. సిర్పూర్(యు) మండలం మర్కలొద్ది గ్రామంలోని 16 కుటుంబాలకు ఎస్సై రామకృష్ణ, సమ్‌రిటర్న్స్ ఫర్ ది నేషన్ సంస్థ ప్రతినిధి రాము ఆధ్వర్యంలో మూడు దీపాలున్న సోలార్ యూనిట్‌ను ఒక్కో కుటుంబానికి పంపిణీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ.. దాదాపు రూ.50 వేల విలువైనవి పంపిణీ చేశామని, ఈ దీపాలు నిత్యం ఎనిమిది గంటల పాటు వెలుగుతాయని పేర్కొన్నారు. ఈ గ్రామానికి సింగిల్ ఫేజ్ విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేసినా గాలులు వీచే సమయంలో, వర్షాకాలంలో రోజుల తరబడి కరెంటు ఉండదని చెప్పారు.



గ్రామస్థులకు సౌర యూనిట్లు అందజేస్తున్న ఎస్సై రామకృష్ణ

అటవీ అభివృద్ధి సంస్థలో సిబ్బంది భర్తీకి చర్యలు



మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఛైర్మన్ పొదెం వీరయ్య, ఎమ్మెల్యే హరీశ్‌బాబు, తదితరులు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: తెలంగాణలో అటవీ అభివృద్ధి సంస్థ పురోగాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలతో పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్ పొదెం వీరయ్య తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని ఎఫ్‌డీసీ స్థలంలో రూ. 80 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన డివిజన్ కార్యాలయ భవన సముదాయాన్ని శనివారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. టీజీఎఫ్‌డీసీ లాభాలబాటలో పయనిస్తోందన్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిసర అటవీప్రాంతాల్లో ఎకో టూరిజం ద్వారా టీజీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేయడానికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎఫ్‌డీసీలో సిబ్బంది కొరత ఉందని, భర్తీకి సీఎంతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో మరిన్ని ప్లాంటేషన్లను ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. టీజీఎఫ్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్ డి.వెంకటేశ్వర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ జి. స్మైలాబ్, డివిజన్ మేనేజర్ శ్రావణి, ఎస్పీఎం డీజీఎం నర్కడె, కాగజ్‌నగర్, మంచిర్యాల, బెల్లంపల్లి రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్లు లక్ష్మణ్, సురేష్‌కుమార్, సునీత, డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ డి. రాకేష్, కార్యాలయ సిబ్బంది, డివిజన్‌లోని ఫీల్డ్ సూపర్‌వైజర్లు, వాచర్లు పాల్గొన్నారు.

షెడ్డు ఓ చోట.. చెత్త మరో చోట!

ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వర్మికంపోస్టు తయారు చేయాలనే ఆశయంతో ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. కొన్నిచోట్ల ఆశయం అందనంత దూరంలో ఉంది. ఎక్కడా షెడ్లలో తడి, పొడి చెత్త వేరు వేసిన దాఖలాలు కనిపించడం లేదు. వర్మికంపోస్టు ఊసే లేదు. కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ శివారులోని షెడ్డులో సేకరించిన చెత్తను వేరు చేయకుండా సమీపంలోనే ఇష్టానుసారంగా పడేస్తున్నారు. అధికారులు స్పందించి ఆశయాన్ని అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటేనే షెడ్లకు వెచ్చించిన నిధులకు సార్థకత లభించనుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



- న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం

ధ్రువపత్రాల పరిశీలనకు 82 మంది గైర్హాజరు



ధ్రువ పత్రాలు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద నిర్వహిస్తున్న డీఎస్సీ-2024 ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శనివారంతో ముగిసింది. ఈ నెల 3వ తేదీ నుంచి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పరిశీలన మొదలు పెట్టారు. జిల్లాలో ఎస్‌జీటీ, ఎస్ఏకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో ఖాళీగా ఉన్న 341 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు ఒక్కో పోస్టుకు 1 : 3 నిష్పత్తిలో అభ్యర్థులను పిలిచారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక టేబుళ్లు ఏర్పాటు చేసి పరిశీలించారు. మొత్తం 774 మందికి గాను 692 మంది అభ్యర్థులు వచ్చి ధ్రువ పత్రాల పరిశీలన చేయించుకున్నారు. 82 మంది హాజరు కాలేదు. డీఈవో యాదయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధ్రువ పత్రాల పరిశీలనను ముగించారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు దుర్గం చైతన్య, కంబాల అజయ్.. జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ అబ్దుల్ రహీం తెలిపారు. గత నెలలో సిరిసిల్లలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మంచిర్యాల జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలవడంలో వీరు కీలక పాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 6-10 తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

ఎస్పీఎం, లారీ అసోసియేషన్ మధ్య వివాదం

కాగజ్‌నగర్, కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం, లారీ అసోసియేషన్ మధ్య వివాదం నెలకొంది. టెండర్‌లో పేర్కొన్న విధంగా లారీలకు కిరాయి ఇవ్వనున్నట్లు యాజమాన్యం చెబుతుండగా, కిరాయి పెంచాలంటూ లారీ అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది. కిరాయి పెంచని కారణంగా లారీల యజమానులు నష్టపోవాల్సి వస్తోందంటూ అసోసియేషన్ సమ్మెబాట పట్టేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా శనివారం మిల్లు నుంచి పేపర్ లోడ్ లారీలను తీసుకొచ్చి అసోసియేషన్ ఎదుట నిలిపేశారు. తమ డిమాండ్లను అంగీకరించకుంటే బయటి లారీలను మిల్లులోపలికి రానివ్వమని, పేపర్ లోడ్ లారీలను కాగజ్‌నగర్ దాటనివ్వమని అసోసియేషన్ మొండికేసింది. ఈమేరకు అసోసియేషన్ ఎదుట ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. తాము ఆర్డర్ పొందిన సంస్థలకు గడువులోపే రవాణా చేయాల్సి ఉండగా అసోసియేషన్ వైఖరి కారణంగా టన్నుల కొద్దీ పేపర్ సరఫరా చేయలేక నష్టపోవాల్సి వస్తోందని మిల్లు యాజమాన్యం పేర్కొంటోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు లారీల వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం లారీ అసోసియేషన్ సభ్యులు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావును కలిసి సమస్యను వివరించారు.



కాగజ్‌నగర్‌లోని లారీ అసోసియేషన్ ఎదుట నిలిపి ఉంచిన పేపర్ లోడ్ లారీలు

అన్నదాత మురిసేట్టు.. అధికారుల కసరత్తు

సన్నాలకు ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు

మంచిర్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే:

ఈ వానాకాలం నుంచే సన్న రకం వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు పెద్ద మొత్తంలో వీటి సాగుపై దృష్టి సారించారు. గతంతో పోలిస్తే ఈసారి సాగు గణనీయంగా పెరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా.. అక్రమాలకు తావు లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దొడ్డు రకం కేంద్రాలతో పాటు ప్రత్యేకంగా సన్నాలకు విడిగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ముందుగా నాట్లు వేసిన చోట వరి పొలాలు గొలక దశలో ఉన్నాయి. ఇవి మరో 20 నుంచి 25 రోజుల్లో కోతకు వచ్చే అవకాశాలున్నాయి. మిగతా చోట్ల ఇప్పుడిప్పుడే పొట్ట దశలో ఉండగా ఇవి నెలన్నర నుంచి 50 రోజుల్లో కోతకు రానున్నాయి..

రైతులు పండించిన పంటకు మద్దతు అందించేందుకు ప్రభుత్వం వివిధ ఏజెన్సీల ద్వారా గతంలో దొడ్డు రకం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో అయినకాడికి వ్యాపారులకే ధాన్యాన్ని అమ్ముకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో సన్నాల సాగు పెరిగింది. బోనస్ ఇస్తుండటం.. సన్న ధాన్యం ఎక్కువ రానుండటంతో ఇందుకు అనుగుణంగా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుపై దృష్టి సారించారు. వచ్చే దిగుబడుల ఆధారంగా కేంద్రాల ఏర్పాటు నిర్ణయాధికారం ప్రభుత్వం కలెక్టర్లకు ఇవ్వడంతో స్థానికగా దిగుబడికి అనుగుణంగా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వచ్చే దిగుబడి అంచనాకు అనుగుణంగా కేంద్రాల ఏర్పాటుపై ప్రతిపాదనలు తయారు చేశారు.



దండేపల్లి శివారులో సాగవుతున్న సన్నరకం వరి

మద్దతు ఇలా...

- ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర 'ఏ' రకానికి రూ. 2,320 'బీ' రకానికి రూ. 2300 ధర ఉంది.
- రూ. 500 బోనస్ కలుపుకుంటే 'ఏ' రకానికి రూ. 2820, 'బీ' రకానికి రూ. 2,800 దక్కనుంది.

ఇబ్బందులు లేకుండా చర్యలు
మోతీలాల్, అదనపు పాలనాధికారి, మంచిర్యాల

ప్రభుత్వం సన్నాలకు మద్దతు ధరకు అదనంగా క్వింటాలుకు రూ. 500బోనస్ ప్రకటించినందున రైతులకు ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా సన్నరకం కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దొడ్డు రకాలతో పాటు సన్నరకాల కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు అందేలా చూస్తాం. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

జిల్లాల వారీగా వరి దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)

● జిల్లా ● సన్నాలు ● దొడ్డు ● ప్రతిపాదించిన కేంద్రాలు(దొడ్డు, సన్నం కలిపి)

జిల్లా	సన్నాలు	దొడ్డు	ప్రతిపాదించిన కేంద్రాలు
మంచిర్యాల	2,10,000	1,00,000	326
నిర్మల్	85,000	60,000	260
కుమురం భీం	82,000	15000	34
ఆదిలాబాద్	1500	500	03

పండ్ల తోటల సాగుపై దృష్టి

జైనూర్, న్యూస్‌టుడే; గ్రామ పంచాయతీల్లో రైతన్నలకు పండ్ల తోటలపై అవగాహన కల్పించి సాగు చేసేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి పంచాయతీలో కనీసం 200 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకాన్ని ప్రారంభించాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే వ్యవసాయ అభివృద్ధి పనులను గ్రామసభలో, క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం చేపట్టాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 80085 73635
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066
(10 AM TO 1 PM)

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే

? పట్టణంలోని మార్కెట్ ఏరియాలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలు ఏర్పడి ప్రయాణం ఇబ్బందికరంగా మారుతోంది. **- గణేష్, కాగజ్‌నగర్**

✔ పురపాలిక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. నిధుల మంజూరు అనంతరం నూతన రోడ్ల నిర్మాణాలు చేపడతాం. **- అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్**

తిర్యాణి, న్యూస్‌టుడే

? తిర్యాణి కుమురంభీం చౌరస్తా నుంచి విజయనగరం వరకు రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు రహదారిని కప్పేస్తున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వాటిని తొలగించాలి. **- శ్రీనివాస్, స్థానికుడు**

✔ పిచ్చి మొక్కలు తొలగించే ఏర్పాట్లు చేస్తాం. **- రాజేశ్వరీ, పంచాయతీ కార్యదర్శి, తిర్యాణి**

సిర్పూర్(టి), న్యూస్‌టుడే

? బస్టాండ్ రోడ్డుపై శునకాలు గుంపులుగా తిరుగుతున్నాయి. వాహనదారులపై దూసుకువస్తున్నాయి. చర్యలు తీసుకోవాలి. **ఏసం రాజు, సిర్పూర్(టి)**

✔ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం. **- తిరుపతి, సిర్పూర్(టి), పంచాయతీ కార్యదర్శి**

పారిశుద్ధ్య లోపం.. వ్యాధుల కారకం


ఓ లాడ్జి వెనుక వైపు పేరుకుపోయిన చెత్తాచెదారం


గాంధీ పార్కు వెనుక పూడికతో నిండిన నాలా

పట్టణంలోని మార్కెట్ ఏరియాలో పారిశుద్ధ్యం లోపిస్తోంది. ఇక్కడి మురుగు కాలువల్లో పూడిక తీయక దుర్గంధంగా మారి దోమలు వృద్ధి చెందుతున్నాయి. రోగాల బారిన పడుతున్నామని మార్కెట్‌వాసులు వాపోతున్నారు. ఏరియాలోని గాంధీ చౌక్ వెనుక వైపు, తీరందాజ్ టాకీస్ ఎదురుగా ఉన్న ఓ లాడ్జి వెనుక వైపు నాలాల్లో రోజుల తరబడి పూడిక తీయడం లేదని, చెత్తాచెదారం తొలగింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. లాడ్జి వెనుక వైపు వెళ్లేందుకు ఉన్న చిన్న సందిని మూసేసిన పురపాలిక అధికారులు ఓ దుకాణం నిర్వాహకుడికి కేటాయించి పన్ను వసూలు చేస్తున్నారు. అటుగా వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉందంటూ పారిశుద్ధ్య సిబ్బంది చెబుతున్నారని ఈ ప్రాంతవాసులు పేర్కొంటున్నారు. రెండు నెలలకోసారి పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారని, క్రమం తప్పకుండా చెత్త సేకరించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కాగజ్‌నగర్

సర్వే వివరాల్లో పొరపాట్లకు తావుండొద్దు


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఇలంబరిది, చిత్రంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు సర్వే నివేదిక స్పష్టంగా రూపొందించాలని ఉమ్మడి జిల్లా సర్వే ప్రత్యేక అధికారి, రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ కె.ఇలంబరిది పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి సర్వేపై సమీక్షించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే చేయాలన్నారు. సర్వే పూర్తయ్యాక ఈ నెల 9న వివరాలను పరిశీలించి నిర్ణీత నమూనాలో పొందుపరిచి నివేదికలు అందించాలని సూచించారు. బృంద సభ్యులకు అందించిన జాబితా ప్రకారం పేర్లు, వివరాలు సరి చూసుకోవాలన్నారు. జిల్లాలో పుర పాలికలు, పంచాయతీల పరిధిలో జరుగుతున్న సర్వే వివరాలను ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని ఆదేశించారు. సర్వే సమయంలో అందుబాటులో ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. సర్వే ప్రక్రియలో ఆధార్ అనుసంధానం, పుట్టిన తేదీ వివరాలు తెలియకపోవడం, ఆఫ్‌లైన్ ఫొటోలు తీసుకోవడంలో ఇబ్బందులపై బృంద అధికారులు ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్లారు. సమర్థంగా సర్వే కోసం ఒక అప్లికేషన్ ఉంటే బాగుంటుందని అభిప్రాయాన్ని వెల్లడించారు. ఆ ఫీడ్‌బ్యాక్ వివరాలను క్రోడీకరించి తనకు అందిస్తే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పుర కమిషనర్లు భుజంగ్‌రావు, అంజయ్య, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్టీలకు వేతనాలు విడుదల

ఈనాడు స్పందనకు వందనం

కెరమెరి, న్యూస్‌టుడే : ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సీఆర్టీల వేతనాలు విడుదలయ్యాయి. శనివారం 'ఈనాడు'లో ప్రచురితమైన 'పండగ పూట పస్తులేనా' శీర్షికకు స్పందించిన అధికారులు.. నాలుగు నెలల బకాయిలు చెల్లింపులో భాగంగా రెండు నెలల వేతనాలు విడుదల చేశారు. దీంతో పండగ పూట కాస్త ఉపశమనం కలిగిందని సీఆర్టీలు హర్షం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


మొర్లె ప్రశాంత్

దహెగాం, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడ్డ ఓ యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఎస్సై కందూరి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మొర్లె ప్రశాంత్(22) ఈ నెల 2న పత్తి చేనుకు పురుగుమందు కొట్టేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లే క్రమంలో హత్తిని శివారులో ప్రమాదవశాత్తు పడిపోయాడు. సమీప చేనులోని రైతు గుర్తె గమనించి అతని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వెంటనే వారు 108 అంబులెన్సులో దహెగాం పీహెచ్‌సీ, అక్కడ నుంచి బెల్లంపల్లి, మంచిర్యాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పురుగుమందు తాగిన ఘటనలో వృద్ధుడు..

కౌటాల: కౌటాల గ్రామ పంచాయతీ పరిధిలోని కోయగూడ గ్రామానికి చెందిన గుర్లె పోచయ్య(75) పురుగుమందు తాగిన ఘటనలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఎస్సై మధుకర్ వివరాల ప్రకారం.. గుర్లె పోచయ్య కొన్ని రోజుల నుంచి వృద్ధాప్యం కారణంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 2న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు కిషన్ ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పరిశీలించి.. సూచనలు చేసి


వెంకట్రావుపేటలో సర్వే పరిశీలిస్తున్న అదనపు పాలనాధికారి దీపక్ తివారీ

కాగజ్‌నగర్ గ్రామీణం, సిర్పూర్(టి), న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ సర్వేను అధికారులు పారదర్శకంగా నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అదనపు పాలనాధికారి దీపక్ తివారీ ఆదేశించారు. కాగజ్‌నగర్ మండలం ఎన్జీవో కాలనీలో నిర్వహిస్తున్న సర్వేను శనివారం పర్యవేక్షించారు. సర్వేలో నిర్దేశించిన అన్ని అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సరి చూసుకోవాలన్నారు. అనంతరం సిర్పూర్(టి) మండలంలోని వెంకట్రావుపేటలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పరిశీలించారు. ఈ నెల 9లోపు పూర్తి చేసి నివేదిక పంపించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, ఎంపీడీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినులు

రెబ్బెన, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన ముగ్గురు బాలికలు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల గోలేటిలో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల నుంచి 9వ తరగతి చదువుతున్న సంకీర్తన, పదో తరగతి చదువుతున్న గాయత్రి, ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న నవ్య.. ఆటలో మంచి ప్రతిభ కనబరిచి కామారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ ఎ.రజిత, వ్యాయామ ఉపాధ్యాయురాలు పి.రజిత, పీఈటీ జి స్వరూప, అధ్యాపకులు అభినందించారు.

అన్నపూర్ణమ్మ చల్లంగా చూడు!


ఇందిరానగర్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


తెలండి ఎస్సీకాలనీ మండపం వద్ద..


సుభాష్‌చంద్రబోస్ కాలనీలోని భక్తరక్షణ విజయదుర్గా మండలిలో..


కాపువాడలోని శ్రీసాయిదుర్గా మండలిలో అన్నపూర్ణాదేవిగా..

రెబ్బెన, న్యూస్‌టుడే: ఇందిరానగర్‌లోని శ్రీకనకదుర్గాదేవి, స్వయంభూ శ్రీ మహంకాళి ఆలయంతోపాటు గోలేటి, దుబ్బగూడెం, రెబ్బెన, ఖైరిగూర ఓసీపీ, గోలేటి సీహెచ్‌పీ, వర్క్‌షాప్‌లలో నెలకొల్పిన మండపాల్లో నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం అమ్మవారు అన్నపూర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు దేవర వినోద్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

తిర్యాణి: జిల్లాలో దుర్గామాత ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు శనివారం అన్నపూర్ణ భవాని అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. తెలండి ఎస్సీ కాలనీలో, తిర్యాణి ఎల్లమ్మ ఆలయంలో, భీమారం హనుమాన్ మందిరంలో నెలకొల్పిన మండపాల వద్ద నిర్వహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కాగజ్‌నగర్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో, ఆలయాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.


బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినులు

తీరొక్క పూలతో..

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య కళాశాలలో శనివారం విద్యార్థులు, మహిళా అధ్యాపకులు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను తీసుకొచ్చి కళాశాల ముందు ఏర్పాటు చేశారు. వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ సందడి చేశారు. కరస్పాండెంట్ సాయిని రాజశేఖర్, ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అటవీశాఖ కార్యాలయం వద్ద...

అయిదుగురు జూదరులపై కేసు నమోదు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలోని నౌగాంబస్తీలో జూదం ఆడుతున్న అయిదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు టౌన్ సీఐ తుత్తూరు శంకరయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు శనివారం టౌన్ ఎస్సై గట్ల సుధాకర్ పోలీసులతో దాడి చేశారు. అయిదుగురు జూదం ఆడుతూ పట్టుబడ్డారని తెలిపారు. వీరి నుంచి రూ. 13,070 నగదుతోపాటు అయిదు చరవాణులు, జూదం కార్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నగలు చోరీ..

ఆసిఫాబాద్: బస్సులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి నగలు చోరీకి గురయ్యాయి. కరీంనగర్‌కు చెందిన కళ్యాణి.. మహారాష్ట్ర చంద్రాపూర్ నుంచి ఆసిఫాబాద్ డిపోనకు చెందిన బస్సులో వస్తున్నారు. తన బ్యాగులో నగలు దాచి ఉంచారు. ఆసిఫాబాద్ బస్టాండ్‌కు వచ్చాక చూసుకుంటే 39 గ్రాముల బంగారం కనిపించలేదు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ సతీష్ పేర్కొన్నారు.

అటవీశాఖ అధికారులపై ఫిర్యాదు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ రేంజ్ అటవీ అధికారులపై శనివారం హైదరాబాదులో భారాస రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అధికారికి ఫిర్యాదు చేసినట్టు భారాస నాయకులు లెండుగురే శ్యాంరావు తెలిపారు. మండలంలోని చింతగూడలో నాగ్‌పూర్ నుంచి కొనుగోలు చేసి ఫర్నీచర్ తయారీ చేస్తున్నందున అనుమతి పత్రాలు లేవంటూ స్థానిక అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈమేరకు ఫర్నీచర్ తయారీదారులతో కలిసి ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

వేతనాలు పెంచి ఇవ్వాలని వినతి

ఆసిఫాబాద్: జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో దినసరి, పార్ట్‌టైం విధానంలో పనిచేస్తున్న కార్మికులకు కలెక్టర్ జారీ చేసిన గెజిట్ ప్రకారం వేతనాలు పెంచి ఇవ్వాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ కోరారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి జిల్లా గిసంశ డీడీ రమాదేవికి వినతి పత్రం అందించారు. కార్మికులకు నెల నెలా వేతనాలు వచ్చేలా చూడాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. సంఘం గౌరవ అధ్యక్షుడు కృష్ణమాచారి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ప్రజా సంఘాల నాయకులు దినకర్, కార్తీక్, కార్మికులు కోటయ్య, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు


ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో దత్తారాం

దహెగాం, న్యూస్‌టుడే : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌డీవో దత్తారాం హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 24 పంచాయతీలలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి చెందిన రూ. 9.43 కోట్ల ఉపాధిహామీ పనులపై వారం రోజులుగా సామాజిక బృందం తనిఖీలు చేపట్టారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజావేదిక ఏర్పాటు చేశారు. పనుల్లో జరిగిన అవకతవకలపై సామాజిక నివేదికలను డీఆర్‌పీలు చదివి వినిపించారు. మండలంలో జరిగిన పనుల్లో అవకతవకలు జరిగాయని, 18మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు అందజేశామని ఆయన తెలిపారు. రూ. 4.20 లక్షలు రికవరీకి ఆదేశించగా రూ. 45 వేల జరిమానా విధించినట్లు చెప్పారు. కమ్మర్‌పల్లిలో పనిచేయని వారికి డబ్బులు చెల్లించారని ఈ పథకంలో రహదారి నిర్మించకున్నా డబ్బులు కాజేశారని పలువురు ఆరోపించారు. దీంతో రహదారి పనులు పరిశీలించి నివేదికలు అందజేయాలని క్వాలిటీ కంట్రోల్ అధికారి రమేష్‌కు ఆయన ఆదేశించారు. విజిలెన్స్ అధికారి కృష్ణమూర్తి, సోషల్ ఆడిట్ అంబుడ్స్‌పర్సన్ అధికారిణి సాయిశ్రీ, ఎస్ఆర్‌పీ ప్రదీప్ పాల్గొన్నారు.

పిల్లల నడవడికపై దృష్టి పెట్టండి


మాట్లాడుతున్న డీసీపీవో మహేష్

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : తల్లిదండ్రులు తమ పిల్లలను నిత్యం జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి బూర్ల మహేష్ సూచించారు. శనివారం మండలంలోని బూరుగూడ పంచాయతీలో యుక్త వయసు బాలికలు సంరక్షణ, భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో తరచూ బాలికలపై అఘాయిత్యాలు జరుగుతుండటం బాధాకరమన్నారు. ప్రధానంగా చరవాణుల వాడకం పెరగడం, తల్లిదండ్రులు పిల్లలపై నియంత్రణ లేకపోవడంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నట్లు చెప్పారు. పిల్లలు వినియోగిస్తున్న చరవాణులపై కన్నేసి ఉంచాలన్నారు. ఎప్పుడైనా పిల్లల్లో భిన్న ప్రవర్తన కనిపిస్తే జాగ్రత్తగా గమనించాలని, వారి నడవడికపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికల పట్ల ఇంట్లో ఎలా వ్యవహరించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే వివరాలను తెలియజేశారు. ఏదైనా అఘాయిత్యానికి గురైతే డయల్ 100లేదా 1098 కి ఫోన్ చేసి చెప్పాలన్నారు. చదువుతోపాటు సామాజిక విలువలు, జీవన నైపుణ్యాలు అలవాటు చేయాలని హితవు పలికారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలతగౌడ్, సూపర్‌వైజర్ లైలా, ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ, బాలరక్షా భవన్ సిబ్బంది చంద్రశేఖర్, బాల ప్రవీణ్, డొంగ్రె ప్రవీణ్, రవళి, సుగుణ, శకుంతల, ఝాన్సీరాణి, సుకన్య, పాల్గొన్నారు.

విజయదశమి ఉత్సవాలకు ఏర్పాట్లు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయం వద్ద ఈ నెల 12న విజయ దశమి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండా వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, సాయంత్రం శమీ వృక్షం వద్ద పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కమిటీ సభ్యులు పిన్న వివేక్, గడ్డల వెంకటేశం, ఏకిరాల శ్రీనివాస్, చిలుకూరి రాధాకృష్ణచారి, ఇరుకుల్ల సుధాకర్, రూప్‌నార్ రమేశ్, మధుకర్, నారాయణమూర్తి, లక్ష్మణమూర్తి, నరసంహస్వామి, కృపాల్, తిరుపతిలు పాల్గొన్నారు.

అటవీ ఉద్యోగుల ద్విచక్రవాహన ర్యాలీ

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ వన్యప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకుని.. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలో అటవీ ఉద్యోగులు ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. అటవీ డివిజన్ కార్యాలయం నుంచి ప్రారంభమై.. రాజీవ్‌చౌక్, సర్ సిల్క్ ఏరియా మీదుగా కార్యాలయం వరకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ శశిధర్‌బాబు మాట్లాడుతూ.. వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టవద్దన్నారు. వన్యప్రాణుల సంరక్షణతోనే అడవుల మనుగడ ముడిపడి ఉందని తెలిపారు. డిప్యూటీ రేంజ్ అధికారి రమాదేవి, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు, వాచర్లు పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గా నవరాత్రుల ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కాగజ్‌నగర్ గ్రామీణ సీఐ శ్రీనివాస్ అన్నారు. శనివారం కాగజ్‌నగర్ గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఆయా మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని, విద్యుత్తు శాఖ అనుమతితోపాటు మండపాల వద్ద సత్ప్రవర్తన కలిగిన వాలంటీర్లను నియమించుకోవాలని సూచించారు. విగ్రహాలను నిమజ్జనం చేసే స్థలం, మార్గం వివరాలను పోలీసులకు అందించాలన్నారు. ఎస్సైలు మహేందర్, రామన్‌కుమార్, పాల్గొన్నారు.

అన్నిరకాల ఔషధాలు ఉండేలా చూడాలని వినతి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దినకర్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరతతో రోగులు బయట కొనుగోలు చేసి ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. సభ్యులు రాజేందర్, కార్తీక్ ఉన్నారు.


20న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడి ఎన్నిక

కాగజ్‌నగర్, రెబ్బెన, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్ష ఎన్నిక ఈ నెల 20న నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుల్బం చక్రపాణి, కోశాధికారి మైలారపు సుగుణాకర్ తెలిపారు. శనివారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి వివరాలు వెల్లడించారు. 20న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. ప్రస్తుత పట్టణ, మండల అధ్యక్ష పదవిలో ఉన్నవారు పోటీకి అనర్హులని చెప్పారు.

ప్రజల హృదయాల్లో నిలిచిన నేత వెంకటస్వామి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: రాజకీయంగా ఎన్నో పదవులు చేపట్టిన కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. వెంకటస్వామి జయంతి సందర్భంగా శనివారం గోలేటిలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర తొలి, మలి ఉద్యమాలలో కీలక పాత్ర పోషించినట్లు చెప్పారు. పేద ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు బయ్యా మొగిళి, ఎస్ఓటు జీఎం కె.రాజమల్లు, ఏరియా ఇంజినీర్ భీమ్‌రావు జాడే, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఐఎన్టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ మేనేజర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

జైనూర్; మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి సేవలు మరువలేనివని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన జయంతి సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీఓ నగేష్, టైపిస్టు గౌతమ్, జూనియర్ అసిస్టెంట్ స్వాతి, పద్మజ, పంచాయతీ కార్యదర్శులు, తదితరులున్నారు.



వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేస్తున్న జీఎం ఎం.శ్రీనివాస్


జైనూర్‌లో..

7 నుంచి రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని శామీర్‌పేట్‌లో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్న పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా కార్యవర్గ సభ్యులు జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాసరావు, చునార్కర్ అనీల్, యూఎన్ చారీలు కోరారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు రఘోత్తంరెడ్డి, బట్టపురం మోహన్‌రెడ్డి, పూల రవీందర్‌లు హాజరవుతారని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించడంతోపాటు రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు.


సెక్యూరిటీ గార్డులకు పదోన్నతుల ప్రతులు అందజేస్తున్న ఏరియా ఎస్ఓటు జీఎం రాజమల్లు

సింగరేణి ఆస్తులు కాపాడటంలో కీలకం


గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: సింగరేణి ఆస్తులను పరిరక్షించడంలో సెక్యూరిటీగార్డుల పాత్ర ఎంతో కీలకమని బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటు జీఎం కె.రాజమల్లు అన్నారు. శనివారం గోలేటి జీఎం కార్యాలయంలోని సెక్యూరిటీ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ సెక్యూరిటీ గార్డులుగా పదోన్నతులు పొందిన బి.రవీందర్, ఒ.సతీష్, ఎం.రమేష్, ఎం.సంజీవ్‌కు పలువురికి పదోన్నతుల ఉత్తర్వులను ఎస్ఓటు జీఎం, సెక్యూరిటీ విభాగం ఇన్‌ఛార్జి గోమాస రవి అందజేశారు. సింగరేణి ఆస్తులకు అండగా నిలుస్తూ భవిష్యత్తులో మరిన్ని పదోన్నతులను పొందాలని సూచించారు. సెక్యూరిటీ జూనియర్ ఇన్‌స్పెక్టర్లు రాజమౌళి, మల్లారెడ్డి, చంద్రయ్య, సీనియర్ సెక్యూరిటీగార్డు టి.రమేష్ పాల్గొన్నారు.

కోలిండియాలో సత్తాచాటాలి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే : క్రీడాకారులు ఉత్తమ ప్రతిభతో కోలిండియా స్థాయిలో సత్తాచాటి సింగరేణికి పతకాలు తేవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. ఏరియా వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం గోలేటి శ్రీభీమన్న మైదానంలో నిర్వహించిన డిపార్ట్‌మెంటల్ హాకీ పోటీలను ప్రారంభించారు. బొగ్గు గనుల్లో పనిచేసే ఉద్యోగులు రోజు ఒక గంటసేపు ఆటలకు కేటాయిస్తే శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసంగా ఉంటారన్నారు. ఏరియా ఎస్ఓటు జీఎం రాజమల్లు, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు బయ్యా మొగిళి, డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహరా, సివిల్ ఎస్ఈ ఎస్కే మదీనా భాషా, ఎన్విరాన్‌మెంట్ అధికారి రమేష్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ కిరణ్‌బాబు, జనరల్ కెప్టెన్ జీపీ చంద్రకుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛతకు గంట సమయం కేటాయించండి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ స్వచ్ఛత కోసం రోజుకో గంట సమయం కేటాయిస్తే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం గోలేటి శ్రీభీమన్న మైదానంలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి మైదానంలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, చెత్తను తొలగించారు. స్వచ్ఛత వ్యక్తిగతంగా మొదలై కాలనీలు, గ్రామాల వరకు కొనసాగాలన్నారు. మైదానంలో నడకదారి వెంట ఉన్న మొక్కలను పూర్తిస్థాయిలో తొలగించి సుందరంగా తీర్చిదిద్దాలని సివిల్ అధికారులకు సూచించారు. ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు బయ్యా మొగిళి, ఎస్ఓటు జీఎం రాజమల్లు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహరా, సివిల్ ఎస్ఈ ఎస్కే మదీనా భాషా, ఎన్విరాన్‌మెంట్ అధికారి రమేశ్, సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్ పాల్గొన్నారు.



కష్టాలను ఎదిరిద్దాం.. కన్నీళ్లను తుడిచేద్దాం

● నవరాత్రుల ప్రబోధమిదే



● బతుకులోని మాధుర్యాన్ని గుర్తిద్దాం

ఈటీవీ - ఆదిలాబాద్ :

కలకానిది విలువైనది బతుకు. కన్నీటిధారలలోనే బలిచేయకు. అగాధమౌజలనిధి లోన ఆణిముత్యమున్నటులే. శోకాలమరుగునదాగి సుఖమున్నదులే. ఏదీ తనంత తానై నీదరికిరాదు. శోధించి సాధించాలి.. అంటాడు మహాకవి శ్రీశ్రీ. ఆకాశంలో మెరుపు క్షణకాలమే కావచ్చు. ప్రపంచానికి వెలుగునిస్తుంది. విరగ కాసిన వృక్షం దెబ్బతగిలినంత మాత్రాన ఫలాలు ఇవ్వటం మరిచిపోదు. జీవితమూ అంతే. చిన్న సమస్యలకే కుంగిపోయి బలవన్మరణాలకు పాల్పడితే ఫలితమేముంటుంది? కష్టాలను ఎదుర్కొంటూ.. కన్నీళ్లను తుడిచేస్తూ ముందుకు సాగితేనే బతుకు సార్థకమవుతుంది. శరన్నవరాత్రులతో పాటు తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరంలోనూ అదే పరమార్థం ఉంది. ఎదిరించి పోరాడాలనే ధీరత్వం ఇమిడి ఉంది. సహజసిద్ధమైన వనరులతో మమేకమై ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆత్మహత్యలు పెరగటం ఆందోళన కలిగిస్తోంది.

శరన్నవరాత్రులు - బతుకమ్మ సంబరాలు ధీరత్వానికి ప్రతీకలు. తొమ్మిది అవతారాలను పరిశీలిస్తే చెడుపై విజయం సాధించిన హితం వెల్లడవుతుంది. పరిస్థితుల రీత్యా బాలత్రిపుర సుందరి, గాయత్రి, అన్నపూర్ణ, లలితా త్రిపుర సుందరి, మహాచండీ, మహాలక్ష్మీ, సరస్వతీ, దుర్గా, మహిషాసుర మర్దని, రాజరాజేశ్వరి దేవి అవతారాలతో బతుకులోని గొప్పదనాన్ని వెల్లడిస్తోంది. తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకల సారాంశం కష్టాలను దిగమింగి జీవితాన్ని ఆస్వాదించాలని చాటిచెబుతోంది. ఆలోచిస్తే అంతర్లీనంగా కుటుంబ మాధుర్యమేంటో గుర్తుకొస్తుంది. బతుకులోని తీయదనం వెల్లడవుతుంది.

వీరత్వానికి ప్రతీక

జోడేఘాట్ కేంద్రంగా సాగిన కుమురం భీం పోరాటం ధీరత్వానికి ప్రతీక. ఇంద్రవెల్లి వేదికగా సాగిన ఆదివాసీల విముక్తి పోరు మరో జలియన్ వాలాబాగ్‌గా ప్రసిద్ధి పొందింది. ఈ రెండు ఘటనలను పరికించి చూస్తే తమ భావాలను పరస్పరం చర్చలు - పరిష్కార మార్గాలేంటి? అని సమాలోచనలు చేయటమే కాకుండా దండుగా ముందుకు సాగినట్లు చరిత్ర వెల్లడిస్తోంది. ఇప్పుడు దండుగా సాగాల్సిన అవసరం లేదు. సమాజం కోసం కదం తొక్కాల్సిన పని లేదనుకున్నా కనీసం ఎవరి కుటుంబాల గురించి వారు ఆలోచిస్తే ఆత్మహత్య అనే ఆలోచననే రాదు. రైతుల కష్టాలను నెమరేసుకుంటే మనకున్నవి ఇబ్బందులే అని అనిపించవు.



ఆత్మహత్యతో వచ్చేదేమిటి?



అదో ఆనందమైన కుటుంబం. భార్యాపిల్లలతో జీవితం సాఫీగా సాగుతోంది. కొన్ని నిర్ణయాలతో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. స్నేహితులతో చర్చించలేదు. బంధువులను సంప్రదించలేదు. భార్యాపిల్లలు సహా తాను ఆత్మహత్య చేసుకోవటంతో ఆ కుటుంబ ప్రస్థానమే ముగిసిపోయింది. భావిజీవితం కలిగిన పిల్లల బతుకు బలైంది. బతికున్న కుటుంబ సభ్యుల్లో తీరని దుఃఖాన్ని మిగిల్చింది. అపవాదును తెచ్చిపెట్టింది. కారణాలు వేరైనా ఉమ్మడి జిల్లాలో ఇలాంటివి ఎన్నో చోటుచేసుకోవటం మనసును కలిచివేస్తోంది.

ఏం చేయాలంటే..

ఉమ్మడి జిల్లాలో నిర్మల్, మంచిర్యాల ప్రాంతాల్లో ఆత్మహత్యల ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, పౌర సమాజం మేల్కోవాలి. జరగకుండా కార్యాచరణను ప్రకటించాలి. గోదావరి, పెన్‌గంగ, ప్రాణహిత జీవనదులే కాదు. సింగరేణి బొగ్గు, తెల్లబంగారమైన పత్తి సహా సహజసిద్ధమైన ప్రకృతి వనరులున్న ఉమ్మడి జిల్లాలో బతుకుదెరువుకు ఉపయుక్తంగా ఉంటుందని వివరిస్తే బలవన్మరణాలు జరగకుండా చూడొచ్చు.



జిల్లాల వారీగా ఆత్మహత్యల వివరాలు..

జిల్లా	ఆదిలాబాద్	ఆసిఫాబాద్	నిర్మల్	మంచిర్యాల
2023	260	156	437	377
2024	193	121	296	350



రాగిజావా.. ఆరోగ్యానికి రక్ష!

● అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీకి సన్నాహాలు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే:

పూర్వ ప్రాథమిక విద్యను అందించడమే కాకుండా ఆరోగ్య రక్షణకు తోడ్పాటు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు మరింత ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. త్వరలో కేంద్రాల్లో రాగి జావా అందిస్తామని మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రకటించడం వారి ఆరోగ్యం మరింత మెరుగుపడే అవకాశం కలగనుంది.

ఇప్పటికే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తున్నా.. చాలా మంది చిన్నపిల్లలు పోషకాహార లోపం నుంచి బయటపడలేకపోతున్నారు. ఎత్తుకు తగ్గ బరువు లేక అనారోగ్యాలు చుట్టుముడుతున్నాయి. ఈ క్రమంలో రాగిజావా రక్త హీనతను తగ్గించి ఎముకలు బలంగా మారడానికి ఎంతో మేలు చేస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 2.50 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. ఘన రూపం కంటే ద్రవరూప ఆహారంతో త్వరగా జీర్ణం అయి మంచి ఆరోగ్యానికి అవకాశం ఏర్పడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

వెంటాడుతున్న పోషకాహార లోపం..

చాలా మంది చిన్నారులు పౌష్టికాహారం సరిగా లేక పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఎత్తుకు తగ్గ బరువు లేక బక్క పలచగా ఉంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని 4,124 అంగన్‌వాడీ కేంద్రాల్లో లోప పోషణ ఉన్న పిల్లలు 5,036 కాగా.. తక్కువ బరువు ఉన్నవారు 16,452 మంది వరకు ఉన్నారు.

పీవీటీజీల కోసం ప్రత్యేక పోషకాహారం..

అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారులకు నిర్వాహకులు నిత్యం గుడ్డుతో భోజనం పెడతారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పీవీటీజీ (పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్)ల్లో చాలా మంది రక్తహీనత, ఎదుగుదల లోపం తదితర అనేక రుగ్మతలతో బాధపడుతున్నారు. వీరికి మరింత బలవర్ధకమైన ఆహారం అందించాలన్న ఉద్దేశంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరి పోషణ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 291 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ అనుబంధ ఆహారాన్ని అందిస్తున్నారు. దీనిలో జొన్న గట్క, చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలు, హల్వా, పల్లిపట్టీ, నువ్వుల పట్టీలను పంపిణీ చేస్తున్నారు.

జిల్లాల వారీగా అంగన్‌వాడీ కేంద్రాలు, నమోదైన లబ్ధిదారులు, పిల్లల ఆరోగ్య పరిస్థితి..

జిల్లా	కేంద్రాల సంఖ్య	0-6 ఏళ్ల పిల్లలు	గర్భిణులు	బాలింతలు	అతి తీవ్ర (పోషకాహార లోపం)	తీవ్ర (పోషకాహార లోపం)	అతి తక్కువ (బరువు)	తక్కువ (బరువు)
కుమురంభీం	973	46414	4981	3223	210	737	535	3692
ఆదిలాబాద్	1256	58,082	6832	3756	316	1612	903	5105
మంచిర్యాల	969	48,557	4681	3269	200	785	314	2418
నిర్మల్	926	1,257	6070	4329	254	922	430	3055

గోదారమ్మకు పోచమ్మ నగలు

● ప్రారంభమైన గంగనీళ్ల జాతర

సారంగాపూర్, న్యూస్‌టుడే : ఏడాదికోసారి జరిగే 'గంగనీళ్ల' జాతర ఉత్సవాలు శనివారం అడెల్లి మహా పోచమ్మ ఆలయం వద్ద అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు అడెల్లి గ్రామంలోని సేవాదారుల ఇంటి నుంచి ఆభరణాలను ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయ ఈవో రమేష్ ఆధ్వర్యంలో బాలాలయంలోని పోచమ్మ తల్లి ఎదుట ఆభరణాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెండి కడవ, ఆభరణాలతో ఆలయ సిబ్బంది, భక్తులు గోదావరికి పాదయాత్రగా పయనమయ్యారు. పోచమ్మ ఆలయం నుంచి మొదలైన పాదయాత్ర దేవినగర్‌తండా, రాయికనగర్, అడెల్లి, సారంగాపూర్, యాకర్‌పల్లి, వంజర్, ప్యారమూర్ మీదుగా దిలావర్‌పూర్ మండలంలోని మాడెగాం, దిలావర్‌పూర్, బన్సపెల్లి, కంజర్ గ్రామాల మీదుగా సాయంత్రానికి సాంగ్వి సమీపంలోని గోదావరి తీరంలోని అక్కడి పోచమ్మ ఆలయానికి చేరుకుంది. రాత్రికి అక్కడే బస చేయనున్నారు. ఆదివారం వేకువజామున అమ్మవారి ఆభరణాలను పవిత్ర గోదావరి నీటితో శుద్ధి చేసి వెండి కడవలో నీటిని తీసుకొని తిరిగి అవే గ్రామాల మీదుగా పాదయాత్రగా సాయంత్రానికి అడెల్లికి రానున్నారు. అడెల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్రలో వేలాది మంది కదం తొక్కుతూ గోదావరికి తరలి వెళ్తూ.. గంగనీకు శరణమే.. ఘనమైన పూజలే.. అంటూ భక్తి గీతాలు పాడుతూ గంగమ్మ చెంతకు పయనమయ్యారు. జిల్లా పోలీసు అధికారిణి జానకి షర్మిల ఆదేశాలతో డీఎస్పీ ఎ.గంగారెడ్డి పర్యవేక్షణలో నిర్మల్ గ్రామీణ సీఐ రామకృష్ణ, సారంగాపూర్ ఎస్సై ఎస్.శ్రీకాంత్ ఇతర పోలీసు అధికారులతో కలిసి భారీ బందోబస్తు చేపట్టారు. తహసీల్దార్ శ్రీదేవి, ఎస్సై శ్రీకాంత్, ఎంపీడీవో లక్ష్మీకాంత రావు, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీ ఆలయ ఛైర్మన్ చందు, కాంగ్రెస్, భాజపా నాయకులు బాలాలయంలోని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.



ఆభరణాలను ఎత్తుకొని ఆలయం నుంచి పాదయాత్రను ప్రారంభిస్తున్న ఈవో రమేష్



అమ్మవారి ఆభరణాల వెంట పాదయాత్రగా గోదావరికి తరలిన భక్తజనం



ప్రధాన మూర్తిగా నెలకొల్పిన ప్రచండ చండిక విగ్రహం



మాధవేశ్వరి అమ్మవారి నమూనా



మాహోర్‌లోని ఏకవీరా దేవికి ప్రతిరూపంగా..



కశ్మీర్‌లోని సరస్వతీ మాతను గుర్తుచేసేలా..

అమ్మవారి శక్తిపీఠాల ప్రదర్శన

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : అమ్మవారి వివిధ రూపాలకు ప్రతిబింబంగా దేశంలో పలు చోట్ల శక్తిపీఠాలున్నాయి. ఇవి అష్టాదశ శక్తిపీఠాలుగా ప్రసిద్ధి పొందాయి. భక్తులకు వీటన్నింటినీ ఒకేసారి దర్శించుకోవడం వీలుపడదు. అయితే.. శక్తిపీఠాలను కాకపోయినా, అక్కడ కొలువైన అమ్మవారి ప్రతిరూపాలను అన్నింటినీ ఒకేచోట దర్శించుకోవచ్చు. దేవీ శరన్నవరాత్రుల నేపథ్యంలో ఈ అవకాశం చక్కని అనుభూతినిస్తోంది. జిల్లాకేంద్రంలోని శ్రీరాజశ్యామల పీఠం అచ్చంగా ఈ తన్మయత్వాన్ని భక్తులకు అందిస్తోంది. స్థానిక బంగల్‌పేట్ శివారులోని రాజశ్యామలాదేవి ఆలయ ప్రాంగణంలో దశసింహ ఉద్భవమైన ప్రచండ చండిక ప్రతిమను నెలకొల్పారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో సుప్రసిద్ధమైన శక్తిపీఠాల్లోని అమ్మవారి ప్రతిరూపాలను ఇక్కడ నెలకొల్పారు. నచ్చిన అమ్మవారి చెంత కూర్చొని పూజించొచ్చు. నవరాత్రులు పూర్తయ్యేవరకు నిత్యం అన్నదానం, కుంకుమపూజ, నవకుండాత్మక చండీహోమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

స్పందించిన మానవతావాదులు

● పసిపాప ఆకలి తీర్చేందుకు విరాళాలు

బేల, న్యూస్‌టుడే : పసిపాప ఆకలి తీర్చేందుకు మానవతావాదులు తమ వంతు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. ఒక్క రోజులోనే 62 మంది స్పందించి రూ. 24,600 ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. రూ. 100 మొదలుకుని రూ. 2 వేల వరకు అందజేశారు. బేల మండలం టెంబ్రీగూడకు చెందిన దేశ్‌ముఖ్ మారుబాయి ప్రసవమై ఆడపిల్లకు జన్మనిచ్చింది. పుట్టిన 23 రోజులకే తల్లిని కోల్పోయిన పసిపాపను బతికించేందుకు అమ్మమ్మ, తాతమ్మలు పడరాని పాట్లు పడుతున్నారు. మూడు రోజులకోసారి పాల డబ్బా కొనుగోలు కోసం 6 కి.మీ దూరం కాలినడకన వాగు దాటి వెళ్తూ కష్టాలు పడుతున్నారు. వారి కష్టాలపై ఈనాడులో 'పసిపాప ఆకలి తీర్చేందుకు 6 కిలోమీటర్ల కాలినడక' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఎంతో మంది సాయం చేసేందుకు ముందుకు రావడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. 'ఈనాడు'కు, దాతలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వందనం

20 పనులు.. ఉపాధి నిధులు

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పేదలకు ఉపాధి కల్పించేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేసే పనుల గుర్తింపు, కార్మిక బడ్జెట్ తయారు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు క్షేత్ర స్థాయిలో చేపట్టే పనులపై ముమ్మర కసరత్తు చేపట్టారు. -న్యూస్‌టుడే, మంచిర్యాల గ్రామీణం

ఒక్కో పంచాయతీకి 20కి మించకుండా పనులు గుర్తించి వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. పల్లెల్లో ప్రాధాన్యం కలిగిన పనులను గుర్తించి గ్రామసభల ద్వారా ప్రజల ఆమోదం పొందనున్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తించిన పనులకు బడ్జెట్‌ను రూపొందించి కేంద్రానికి పంపిస్తారు. అనంతరం కేంద్రం నుంచి ఆదేశాలు రాగానే వచ్చే ఏప్రిల్ నుంచి వార్షిక ప్రణాళిక కార్మిక బడ్జెట్ ఆధారంగానే ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టనున్నారు.



పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

2025-26 ఉపాధి వార్షిక ప్రణాళిక తయారీ ఇలా

వార్షిక ప్రణాళికపై గ్రామసభల నిర్వహణ : 2 అక్టోబర్ నుంచి 30 నవంబర్ 2024 వరకు

జిల్లా స్థాయి వార్షిక ప్రణాళిక ఆమోదం : 21 జనవరి 2025

రాష్ట్ర స్థాయిలో ఆమోదం : 31 జనవరి 2025

లేబర్ బడ్జెట్ విడుదల : 31 మార్చి 2025

జిల్లాల వారీగా జాబ్‌కార్డులు, కూలీల వివరాలు..

జిల్లా	మండలాలు	పంచాయతీలు	జాబ్ కార్డులు	కూలీలు
ఆదిలాబాద్	17	468	1,75,747	3,70,082
కుమురంభీం	15	335	1,29,885	2,77,287
నిర్మల్	18	396	1,80,572	3,70,550
మంచిర్యాల	16	311	1,21,067	2,55,151

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

2025-26 ఆర్థిక ఏడాదిలో గ్రామాల్లో పేదలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనల ప్రకారమే కార్మిక బడ్జెట్ రూపకల్పన చేసేలా చర్యలు తీసుకుంటాం. నిర్దేశిత లక్ష్యం మేరకు కూలీలకు పనిదినాలు కల్పించి చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేసేలా కృషి చేస్తాం. - కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, మంచిర్యాల

వార్షిక బడ్జెట్‌లో చర్చించే అంశాలివే..

పల్లెల్లో పేదలకు కనీసం వంద రోజుల పాటు ఉపాధిని కల్పించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం ద్వారా 2025-26 సం.లో 17 కేటగిరీల్లో 266 రకాల పనులు చేయనున్నారు.

- ప్రధానంగా అసంపూర్తి పనులపై చర్చించాలి.
- జాబ్ కార్డుల అప్‌డేషన్, పౌర సమాచార బోర్డుల తయారీ, సామాజిక తనిఖీలపై చర్చలు
- సామాజిక తనిఖీల కోసం స్వయం సహాయక సంఘాల నుంచి ముగ్గురు చురుకైన మహిళలను గ్రామ రిసోర్సు పర్సన్లుగా నియమించాలి.
- వ్యవసాయ, సహజ వనరులు, జీవనోపాధుల పెంపు పనులపై చర్చించాలి.
- ఇంకుడు గుంతలు, కంపోస్టు షెడ్, ఉద్యాన శాఖ, ప్లాంటేషన్ పనులను పర్యవేక్షణ
- భూగర్భజలాల పెంపుదలను జలదూత్ యాప్‌లో పొందుపర్చాలి.
- బయోగ్యాస్ ప్లాంట్‌పై, అమృత్ సరోవర్ పథకంపై ప్రత్యేకంగా చర్చించి నిర్ణయం తీసుకుంటారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో మొదటిస్థానం



మొదటిస్థానం కైవసం చేసుకున్న ఉమ్మడిజిల్లా హ్యాండ్‌బాల్‌జట్టు

మంచిర్యాల క్రీడావిభాగం, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారిణులు సత్తాచాటారు. హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో మెరిశారు. మొదటిస్థానాన్ని కైవసం చేసుకున్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య నారాయణపేట జిల్లాలో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న 68వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో ప్రతిభ చాటి పసిడి పతకాన్ని సాధించారు. శనివారం జరిగిన తుదిపోరులో ప్రత్యర్థి కరీంనగర్ జిల్లా జట్టును 14-5 గోల్స్ తేడాతో ఓడించారు. మెరుగైన ఆటతీరును కనబరిచి క్రీడాకారిణులకు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా అభినందనలు తెలియజేశారు.

కుస్తీ పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్ క్రీడావిభాగం: నారాయణపేటలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కుస్తీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్-14, 17, 19 ఏళ్ల విభాగం ఆయా బరువుల కేటగిరీల్లో 4 పసిడి, 2 రజతాలు, 7 కాంస్య పతకాలు సాధించారు. పసిడి పతకం సాధించిన వారిలో పి.నైతిక, సీహెచ్.సహారా, ఎం.స్పందన, డి.శాలిని ఉన్నారు. భువనేశ్వరి, కె.శ్రీజ రజత పతకాలు సాధించారు. ఆర్.అనూష, ఎస్.నందిత, బి.వైష్ణవి, జె.పావని, ఈశ్వరి, కె.శ్రీవల్లి, పి.సహస్ర కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.



రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు

నవోదయలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ఖాళీగా ఉన్న ఏడు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కొడాలి పార్వతి తెలిపారు. 11వ తరగతిలో ప్రవేశాలకు సైతం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, విద్యాసంవత్సరం ప్రారంభం అనంతరం ఖాళీల వివరాలను వెల్లడిస్తామన్నారు. ఈ నెల 30వ తేదీలోపు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 7తో గడువు ముగియనుందని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.